సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 26 । జూన్ । 2025



అభివృద్ధికి పరిశ్రమలే కీలకం

గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందడానికి పరిశ్రమలే కీలకమని జిల్లా సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి పేర్కొన్నారు. -8లో



సౌమ్యనాథ బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

సౌమ్యనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం ఆదేశించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.210	రూ.270
రెండోరకం	రూ.150	రూ.210



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1457 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	470	600
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 319.420 కిలోలు

న్యూస్‌రీల్

29న బీసీ మహాసభ

మదనపల్లె సిటీ: మదనపల్లెలో ఈనెల 29వ తేదీన జరిగే బీసీ మహాసభను జయప్రదం చేయాలని బీసీ జనసభ వ్యవస్థాపకుడు బోడే రాజశేఖర్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీలకు ఏం చేసిందని ప్రశ్నించారు. ఈ విషయంపై మేధావులతో చర్చిస్తామన్నారు. స్థానిక టమటా మార్కెట్ నుంచి శ్రీకృష్ణ కళ్యాణ మండపం వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కరీముల్లా, రామాంజులు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని జమ్మలమడుగు పట్టణంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు జమ్మలమడుగు పట్టణం ముద్దనూరు రోడ్డులోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో ఈ జాబ్‌మేళా ఉంటుందని పేర్కొన్నారు.

అర్హులైన అర్చకులు డీడీఎన్‌ఎస్ కింద దరఖాస్తు చేసుకోవాలి

మదనపల్లె సిటీ: అర్హులైన అర్చకులు దీప, దూప నైవేద్యం (డీడీఎన్‌ఎస్) కింద దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్ అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 275 ఆలయాల్లో డీడీఎన్‌ఎస్ కింద అర్చకులకు గౌరవ వేతనం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఏడు ఆలయాలకు పాలకమండళ్లకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. త్వరలో మిగిలిన ఆలయాలకు ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే నోటిఫికేషన్ ఇస్తామన్నారు. శ్రీవాణి ట్రస్టు కింద జిల్లాలో 275 ఆలయాల్లో పనులు జరుగుతున్నాయన్నారు.

'ఆలయాల్లో హుండీ ఆదాయం లెక్కింపు: స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో మూడు నెలలకు సంబంధించి రూ.6,51,640 ఆదాయం వచ్చింది. బెంగుళూరు రోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయంలో రూ.61,079 ఆదాయం వచ్చింది.

హంద్రీ-నీవాలో ముడుపులకే పెద్దపీట



- పుంగనూరు ఉపకాలువ లైనింగ్ పనుల విధుల అప్పగింతలో ఇష్టారాజ్యం
- అయినవారికి ఎక్కువ..కాని వారికి మొక్కుబడిగా కిలోమీటర్ల కేటాయింపు
- మెకానికల్ కేడర్‌కు సివిల్ పనుల అప్పగింత
- కుప్పం డివిజన్ డీఈకి ఇక్కడ విధులు

మదనపల్లె: హంద్రీ-నీవా సాగు, తాగునీటి ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన పుంగనూరు ఉపకాలువ లైనింగ్ పనులకు అధికారులకు విధుల అప్పగింతల్లో ముడుపులకే పెద్దపీట వేశారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఏ అధికారి ఎంత ముట్టచెప్పారో వారికి అంతే పనుల బాధ్యతను అప్పగించడం జరిగిందని ప్రాజెక్టు వర్గాల్లోనే తీవ్రమైన చర్చ సాగుతోంది. ఈ ఆరోపణల్లో నిజమెంత అని అభిప్రాయం వ్యక్తం చేయొచ్చు కాని పనుల బాధ్యత అప్పగింత వ్యవహారం పరిశీలిస్తే ఆరోపణల్లో నిజం లేకపోలేదన్న అభిప్రాయం కూడా వ్యక్తం అవుతోంది. రూ.366 కోట్ల పనులు కాబట్టి, అందులోనూ అధికార టీడీపీకి వత్తాసు పలికే పరిస్థితి ఉండటంతో నాణ్యత, నిబంధనలు, పాటించాల్సిన సాంకేతిక నిబంధనలను పక్కన పెట్టి అందినకాడికి దండుకోవచ్చు అనే ఆశతో కొందరు అధికారులు అడిగినంతా ఇచ్చుకుని పుంగనూరు ఉపకాలువ లైనింగ్ పనుల బాధ్యతలు చేపట్టినట్టు చర్చనీయాంశమైంది.

రూ.366 కోట్లతో లైనింగ్ పనులు

జిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, ములకలచెరువు, కురబలకోట, మదనపల్లె రూరల్, మదనపల్లె పట్టణం, చిత్తూరు జిల్లా పుంగనూరు, పెద్దపంజాణి మండలాల్లో సాగే పుంగనూరు ఉప కాలువ సిమెంటు లైనింగ్ పనులను రూ.366 కోట్లతో ప్రభుత్వం చేపట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పుంగనూరు ఉపకాలువ వెడల్పు కోసం రూ.1,217 కోట్లతో పనులు చేపట్టగా దాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఇవే నిధులు, ఈ ఒప్పంద గడువుతో రూ.480.22 కోట్లతో ఈ కాలువకు సిమెంట్ లైనింగ్, ఇతర పనులు పూర్తి చేసేలా నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీకి నామినేషన్ మీద పనులను అప్పగించింది. ఈ పనులకు టెండర్ లేకపోవడం, నామినేషన్‌పై ప్రభుత్వం పని అప్పగించడంతో ఈ పనుల బాధ్యతలను చూసేందుకు ప్రాజెక్టులోని అధికారుల మధ్య పోటీ పెరిగింది. దీనితో అయినవారికి, పనుల్లో లోపాలున్నా అనుకూలంగా వ్యవహరించే వారికి, ముడుపులు ముట్టజెప్పిన వాళ్లకే బాధ్యతలు అప్పగించారన్నది ఆరోపణలు.



హంద్రీనీవా ప్రాజెక్టు మదనపల్లె సర్కిల్-3 కార్యాలయం

అందుకు ఈ కేటాయింపులే బలం

ముడుపులకే పనుల బాధ్యతల అప్పగింత ఆరోపణలకు కేటాయించిన కిలోమీటర్ల పనులే బలం చేకూర్చుతున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. పుంగనూరు ఉపకాలువలో డీఈ వెంకట ప్రతాప్‌కు 74 కిలోమీటర్ నుంచి 110 కిలోమీటర్ వరకు, తిరిగి 150 కిలోమీటర్ నుంచి 165 కిలోమీటర్ వరకు, డీఈ కృష్ణ కిశోర్‌కు 110 కిలోమీటర్ నుంచి 142 కిలోమీటర్ వరకు, డీఈ రమణరావుకు 165 కిలోమీటర్ నుంచి 180 కిలోమీటర్ వరకు, డీఈ రవికి 180 కిలోమీటర్ నుంచి 195 కిలోమీటర్ వరకు, డీఈ సెల్వరాజ్‌కు 195 కిలోమీటర్ నుంచి 207.800 కిలోమీటర్ వరకు పనులను అప్పగించారు. దీన్ని పరిశీలిస్తే..డీఈ వెంకటప్రతాప్‌కు అత్యధికంగా 41 కిలోమీటర్లు అప్పగించారు. కృష్ణకిశోర్‌కు 32 కిలోమీటర్లు అప్పగిస్తే.. రమణరావుకు 15, రవికి 15, సెల్వరాజ్‌కు 12 కిలోమీటర్లు బాధ్యతలు కేటాయించారు. దీన్నిబట్టి పనుల అప్పగింత బాధ్యతల్లో ఏమి జరిగి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

కుప్పం డీఈకి ఎందుకు

195 కిలోమీటర్ నుంచి 207.800 కిలోమీటర్ పనుల పర్యవేక్షణ చేస్తున్న కుప్పం డీఈ సెల్వరాజ్‌కు పుంగనూరు ఉపకాలువలో బాధ్యతలు అప్పగించడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కుప్పం డీఈకి చిత్తూరుజిల్లాలో జరుగుతున్న పనుల బాధ్యతలు అప్పగించాలి. అలా కాకుండా అన్నమయ్యజిల్లాలో జరిగే పనులకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. దీనివెనుక అసలు కారణమేమిటో ఉన్నతాధికారులకే తెలియాలి. ఇలా ఉండగా మెకానికల్ డివిజన్ విధులు నిర్వహించే అధికారులకు సివిల్ పనుల బాధ్యత అప్పగించడం చర్చనీయాంశమైంది.

బిల్లులకు కీలకం కాబట్టే..

పుంగనూరు ఉపకాలువలో లైనింగ్ పనులు రూ.366 కోట్లతో చేపట్టారు. ఇందులో లైనింగ్ పనులు చేపట్టి పూర్తి చేసే దాక కిందిస్థాయి సాంకేతిక అధికారులు కీలకం. పనుల పర్యవేక్షణ, నాణ్యత, నిబంధనల పాటింపు, సాంకేతిక తప్పిదాలను గుర్తించి సరిచేయడం, ఒప్పందం మేరకు పనులు చేస్తున్నారా లేదా అని పరిశీలిస్తూ ఒప్పందంకు అనుగుణంగా పనులు చేయించాలి. ఏ చిన్న పనైనా నిబంధనలను తప్పించి చేస్తే అప్పటికప్పుడే చర్యలు తీసుకోవాలి. అంటే ఈ పనిలో ఎవరి బాధ్యత ఎంత కీలకమో అర్థమవుతుంది. క్షేత్రస్థాయిలో జేఈ, డీఈ పనులను నమోదు చేయడం, నాణ్యతపై పరిశీలించి చర్యలు తీసుకుంటే వీరు నమోదు చేసి రికార్డుల మేరకు పనులను ఆమోదించి చేసిన పని విలువ మేరకు బిల్లుల మంజూరుకు ఈఈ సిఫార్సు చేస్తారు. కాబట్టి లైనింగ్ పనుల్లో ఎవరు కీలకమైన అధికారులో స్పష్టమైంది. దీనివల్లే ఈ లైనింగ్ పనుల బాధ్యతలను చూసేందుకు ప్రాజెక్టులో పని చేస్తున్న అధికారుల మధ్య పోటీ పెరిగి ముడుపులు చెల్లించి పనులను కేటాయింపు చేయించుకున్నట్టు బలమైన ఆరోపణలు వినవస్తున్నాయి.

ముడుపుల మాటలేదు..

పీబీసీ లైనింగ్ పనులకు ఇంజనీరింగ్ అధికారుల కేటాయింపు, బాధ్యతల అప్పగింతల్లో అవినీతి జరగలేదు. కిలోమీటర్ల బాధ్యతల పనుల కోసం ముడుపులతో కేటాయింపులు జరిగాయన్నది నిజం కాదు. పద్ధతి ప్రకారమే బాధ్యతలు అప్పగించడం జరిగింది. -విఠల్ ప్రసాద్, ఎస్ఈ, మదనపల్లె

శాఖల సమన్వయంతోనే ఆదాయం పెంపు

- జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: అన్ని శాఖల సమన్వయంతోనే వార్షిక ఆదాయం పెంపు సాధ్యమని, పన్నుల పరిధిలోని అన్నింటినీ తీసుకురావడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జీఎస్టీ ఆదాయంపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ జీఎస్టీ అధికారి, జిల్లా పంచాయతీశాఖ మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఆడిట్ శాఖ తదితర శాఖల జీఎస్టీ ఆదాయాన్ని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమయ్యే ఆదాయాన్ని పన్నులు ద్వారా సమీకరిస్తుందని కలెక్టర్ అన్నారు. రాష్ట్ర జీఎస్టీ ఆదాయాన్ని పెంచడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, వైఖోమ్ నదియా దేవి, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా జీఎస్టీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడిన యోధులను స్మరించుకునేందుకే..

ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడిన యోధులను స్మరించుకునేందుకే రాజ్యాంగ హత్య దినం జరుపుకుంటున్నామని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రాజ్యాంగ హత్య దినంను నిర్వహించారు. డీఆర్‌ఓ మధుసూదనరావు, అదనపు ఎస్పీ వెంకటాద్రి మాట్లాడారు.

'అమ్మా, నాన్న నేను ఇంటిలో ఉండి చదువుకుంటాను. ఇంట్లో వాళ్లను వదిలి ఒక్క క్షణం కూడా ఉండలేను. చదువు పేరుతో నన్ను ఇంటి నుంచి దూరం చేయాలని చూడవద్దు. నాకు మీ ప్రేమానురాగాలు కావాలి. బాగా చదువుకుని టీచర్నై పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పుతాను' ఓ కుమార్తె అభ్యర్థన.

నువ్వు హాస్టల్లో ఉండి చదవాల్సిందే. మంచి మార్కులు, ర్యాంకులు సాధించి డాక్టర్ కావాలి. తల్లిదండ్రుల సమాధానం. ఇదీ నేడు కొందరు తల్లిదండ్రులు పిల్లల పట్ల వ్యవహరిస్తున్న తీరు. పిల్లల ఆలోచన, వారి అభిరుచులకు భిన్నంగా స్పందిస్తున్న విధానం. దీంతో పిల్లలు ఒంటరిగా హాస్టళ్లలో ఉండలేకపోతున్నారు. కొందరు ఆత్మన్యూనతా భావంతో పెరిగి పెద్దవారై ఒంటరితనానికి అలవాటు పడుతున్నారు.

జిల్లాలో జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభమయ్యాయి. చాలా మంది తమ పిల్లలను విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడప వంటి నగరాల్లోని కార్పొరేట్, రెసిడెన్షియల్ కాలేజీల్లో చేర్పిస్తున్నారు. అక్కడ హాస్టళ్లలో ఉండలేక చాలా మంది ఇంటి బాట పడుతున్నారు. మరి కొందరు తల్లిదండ్రులు బలవంతంగా అక్కడే ఉండమని నచ్చచెబుతున్నారు. దీంతో విద్యార్థులు ఒంటరితనంతో నిత్యం మానసిక సంఘర్షణ పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులకు ఎదురవుతున్నాయి.

అమ్మా.. నాన్నా మీ ప్రేమ కావాలి..!

- ప్రేమానురాగాలకు దూరమవుతున్న పిల్లలు
- తల్లిదండ్రుల నుంచి అందని అనురాగం
- ఒంటరితనంతో నిత్యం మానసిక సంఘర్షణ




మదనపల్లె సిటీ: బాల్యం పిల్లలకు దేవుడిచ్చిన వరం. తల్లిదండ్రుల ప్రేమానురాగాల మధ్య ఆడుతూ పాడుతూ, చిరునవ్వులు చిందిస్తూ బాల్యాన్ని ఆస్వాదించాలి. అప్పుడే బాల్యానికి సాకారం. ప్రపంచాన్ని అర్థం చేసుకునే విధానం కుటుంబం నుంచి రావాలి. నేటి పోటీ ప్రపంచం, ప్రపంచీకరణ నేపథ్యంలో కొందరు తల్లిదండ్రులు పిల్లల బాల్యాన్ని హరిస్తూ యాంత్రిక జీవనానికి అలవాటు చేస్తున్నారు. బాల్యంలోని మధురానుభూతులకు దూరం చేస్తున్నారు. పిల్లలను మార్కులు, ర్యాంకులను తయారు చేసే యంత్రాలుగా చేస్తున్నారు. దీని కోసం వారి ఇంటి నుంచి దూరంగా కార్పొరేట్ పాఠశాలల్లో బలవంతంగా చేర్పిస్తున్నారు. పాఠశాల స్నేహితుల సాన్నిహిత్యం ఉన్నా అమ్మ పంచే ప్రేమకు ఏదీ సాటిరాదు. నాన్న చూపే ఆదరణ ఏదీ సరితూగవు. దీంతో పిల్లలు తమలో తాము సంఘర్షణ పడుతూ జీవితాన్ని గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎప్పుడూ మార్కులు, ర్యాంకులే కాకుండా వారి కోసం కాస్త సమయాన్ని కూడా కేటాయించి ప్రేమను పంచాలని పిల్లలు తల్లిదండ్రుల నుంచి ఆశిస్తున్నారు. ఇదే విషయాన్ని మనోవ్యక్తిత్వ వికాస నిపుణులు కూడా అంటున్నారు. లేనిపక్షంలో పిల్లల్లో భావవ్యక్తీకరణ నైపుణ్యం తగ్గడంతో పాటు అభద్రతా భావం పెరుగుతుందని చెబుతున్నారు. కౌమార దశలోని పిల్లలకు తల్లిదండ్రుల నుంచి సరైన ప్రేమానురాగాలు లభించకపోతే వారిలో మానసిక రుగ్మతలు చోటు చేసుకుంటాయని వెల్లడిస్తున్నారు. ఆయా వయస్సులో వచ్చే శారీరక, మానసిక మార్పులను సరిచేయక, సరైన మార్గదర్శనం చేయకపోతే పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుందని సూచిస్తున్నారు. కొందరు పిల్లలు తప్పటడుగులు వేసే ప్రమాదం కూడా లేకపోలేదని హెచ్చరిస్తున్నారు. మరికొందరైతే ఏ చిన్న సమస్య ఎదురైనా అఘాయిత్యాలకు పాల్పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

కనుమరుగవుతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ

గతంలో అవ్వా,తాతలు, అమ్మానాన్నలు, చిన్నాన్న, పెద్దనాన్న, వారి పిల్లలతో కూడిన ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. కాలానుగుణంగా చోటు చేసుకుంటున్న మార్పులతో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగైంది. నేటి కొందరు తల్లిదండ్రుల ఆలోచనా విధానంతో కనీసం కన్న బిడ్డలతో కూడిన సమిష్టి కుటుంబ వ్యవస్థ కూడా మాయమైపోతోంది. పిల్లలను వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించి ఒంటరి జీవన విధానాన్ని అలవాటు చేసుకుంటున్నారు. సమాజంలో అనుబంధం, ప్రేమ, వాత్సల్యం అనే పదాలకు అర్థాలు కూడా మరచిపోతున్నారు.


మానసిక ఒత్తిడితో అనర్థాలు..



చిన్నప్పటి నుంచే పిల్లలు తల్లిదండ్రుల ప్రేమకు దూరమైతే మానసిక ఒత్తిడి పెరిగి అనేక అనర్థాలకు దారితీస్తాయి. ఆస్పత్రులకు వైద్య పరీక్షల కోసం వచ్చే విద్యార్థుల్లో అనేక మంది మానసిక ఒత్తిడితో పాటు మనోవేదనకు గురైన వారే ఉంటున్నారు. ఇంటికి, తల్లిదండ్రులకు దూరంగా ఉన్నందున ఆహారం సరిగ్గా తీసుకోకపోవడం, పోషక విలువలు కలిగిన ఆహారం అందకపోవడంతో వ్యాధులకు గురవుతున్నారు.

– చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె


తల్లిదండ్రుల ధోరణి మారాలి



ఆధునిక జీవన విధానంలో అమ్మానాన్నల ఆలోచనా ధోరణి మారాలి. శారీరక, మానసిక పెరుగుదల వేగంగా జరిగే కౌమార దశలో పిల్లలకు కుటుంబంలోని ప్రత్యక్షానుభవాలు ఎంతో అవసరం. ఈ దశలో పిల్లలు ఎదుర్కొనే సంఘర్షణలను అమ్మానాన్నలు మాత్రమే అర్థం చేసుకోగలరు. పిల్లల కోసం సమయాన్ని కేటాయించి.. ప్రేమానురాగాలు పంచాలి.

-ఎస్.రెడ్డప్పరెడ్డి, అధ్యాపకులు, బాలికల జూనియర్ కాలేజీ, మదనపల్లె

తల్లిదండ్రుల అనురాగం అవసరం



బాల్యంలో చిన్నపిల్లలకు తల్లిదండ్రుల ప్రేమానురాగాలు చాలా అవసరం. తల్లిదండ్రులు ఎంత ఉద్యోగులైనా పిల్లల కోసం రోజూ కొంత సమయాన్ని కేటాయించాలి. ఒక వయస్సు వచ్చే వరకు పిల్లలు తల్లిదండ్రులతో కలిసి ఉండేలా చూడాలి. చదువంటే మార్కులు, ర్యాంకులు మాత్రమే కాదనే విషయాన్ని గ్రహించాలి. పిల్లల అభిరుచి మేరకు వారిని ఎదగనివ్వాలి. వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలి.

– టీఎస్‌ఏ క్రిష్ణమూర్తి, ప్రముఖ నవలా రచయిత, మదనపల్లె

టీడీపీలో కలవరం!



వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సుగవాసి బాలసుబ్రమణ్యం, చిత్రంలో పార్టీ ముఖ్య నేతలు

- వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరిన సుగవాసి బాలసుబ్రమణ్యం
- అన్నమయ్య జిల్లాలో ఇదే బాటలో మరికొందరు

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా తెలుగుదేశం పార్టీలో కలవరం మొదలైంది. పార్టీ అధిష్టానం టీడీపీలో గట్టి పట్టున్న వారిని పట్టించుకోకపోవడం, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను ప్రకటించకపోవడం, ప్రస్తుత సర్కార్‌లో అవినీతి కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నా మిన్నకుండిపోతుండడం వంటి ఘటనలతో పార్టీలో సీనియర్ నాయకులు మనస్థాపం చెందుతున్నారు. ఎప్పటినుంచో పార్టీని నమ్ముకుని కష్టపడి పనిచేసిన వారికి కాకుండా అప్పటికప్పుడు పార్టీలోకి వచ్చిన వారికి టీడీపీ అధిష్టానం పదవులు కట్టబెడుతుండడంపై కూడా పార్టీలోని సీనియర్ నాయకులు రగలిపోతున్నారు. ప్రధానంగా జిల్లాలో కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకులను టీడీపీ కరివేపాకులా వాడుకుని వదిలేసిందన్నది మెజార్టీ ప్రజల నుంచి అభి ప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఎన్ని అవమానాలకు గురిచేసినా పార్టీని అంటిపెట్టుకుని పనిచేసిన మాజీ జెడ్పీ చైర్మన్, టీడీపీ రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, మాజీ ఎంపీ దివంగత సుగవాసి పాలకొండ్రాయుడు పెద్ద కుమారుడు సుగవాసి బాలసుబ్రమణ్యంను పార్టీ అధిష్టానం అవమానాలకు గురి చేయడంతో తిరుగుబాటు బావుటా ఎగురవేసి టీడీపీకి రాజీనామా చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో టీడీపీలో కలవరం మొదలైంది.

రాజంపేట నుంచి పోటీ చేసినా...

ఎన్నికల్లో రాజంపేట నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా సుగవాసి బాలసుబ్రమణ్యం పోటీ చేశారు. పాలకొండ్రాయుడు కుటుంబం నుంచి రాయచోటికి అవకాశం పరిశీలించాలని పదేపదే అడిగినా కాదని, రాజంపేట నియోజకవర్గం అప్పగించారు. అయినా బాలసుబ్రమణ్యం వెనుకంజ వేయకుండా రాజంపేట టీడీపీ టిక్కెట్‌పై పోటీ చేశారు. ఏరు దాటకముందు ఓడ మల్లన్న..ఏరు దాటాక బోడి మల్లన్న అన్న చందంగా.. టీడీపీ అధిష్టానం వ్యవహరించడంపై పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఎన్నికల తర్వాత ఓడిపోయిన అభ్యర్థికి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ఇన్‌ఛార్జి పదవిని కట్టబెట్టకుండా నాన్చుడు ధోరణితో ముందుకు వెళ్లింది. అంతవరకు బాగానే ఉన్నా మరో పక్క ఇంకో నాయకుడిని అదే నియోజకవర్గంలో ప్రోత్సహించడం వెనుక పొమ్మనకుండానే పొగబెట్టినట్లు అర్థమవుతోంది.

రాయచోటిలో 'సుగవాసి' కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు

రాయచోటి నియోజకవర్గంలో మాజీ ఎంపీ, దివంగత సుగవాసి పాలకొండ్రాయుడు కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్ల నుంచి కూడా టీడీపీని నమ్ముకునే పాలకొండ్రాయుడు కుటుంబం రాజకీయాలు చేసింది. అంతేకాకుండా రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లెలో కూడా సుగవాసి కుటుంబాన్ని అభిమానిస్తూ వారి వెంట నడుస్తున్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా ఇలా వివిధ హోదాల్లో పనిచేసి పార్టీకోసం కష్టపడిన పాలకొండ్రాయుడిని చివరి గడియల్లో కూడా అధిష్టానం పట్టించుకోలేదు. ఎన్నికల సమయంలో ఆరోగ్యం సహకరించకపోయినా టీడీపీకి ఓటు వేయాలంటూ ప్రచారం చేసిన పాలకొండ్రాయుడు ఇటీవల మృతి చెందినంతరం కూడా ఆ కుటుంబాన్ని పట్టించుకోకపోవడం ఆయన అభిమానులను తీవ్రంగా కలిచివేసింది. ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు టీడీపీలో ప్రధాన నేతలు రాకపోవడం, మహానాడు కార్యక్రమంలో సంతాపాన్ని తెలియజేయకపోవడం అభిమానులతోపాటు కుటుంబంలోనూ బాధను నింపింది. అంతేకాకుండా పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన పాలకొండ్రాయుడు కుటుంబాన్ని అధోగతి పాలు చేసేలా అధిష్టానం తీసుకున్న చర్యలపై సుగవాసి బాలసుబ్రమణ్యం కినుకు వహించారు. ఇటీవల సీఎం చంద్రబాబు సంబేపల్లెకు వచ్చిన సందర్భంలోనూ, ఒంటిమిట్ట కల్యాణం సందర్భంలోనూ, ఇతర సందర్భాల్లోనూ బాలసుబ్రమణ్యంకు అవకాశం ఇవ్వకుండా చేయడంపై కుటుంబంలో కలకలం రేగింది. ఈ నేపథ్యంలో అధిష్టానం తీరు నచ్చక సుగవాసి బాలసుబ్రమణ్యం టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా నేతలు



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న జిల్లా నేతలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మేయర్, జిల్లా అధ్యక్షులు తదితరులు హాజరయ్యారు. బుధవారం విజయవాడలోని తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నుంచి పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీలు పి. రామసుబ్బారెడ్డి, రమేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరుముట్ల శ్రీనివాసులు, కడప మేయర్ కె. సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


మృతి చెందిన శ్రీనివాసులు

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరు -మదనపల్లె రోడ్డు మార్గంలోని బలిజపల్లె వద్ద గత శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని దిగువపల్లెకి చెందిన లక్ష్మీ నరసమ్మ(65) మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కృష్ణమ్మ, శ్రీనివాసులుకు తీవ్ర గాయాలు కాగా వారిని మదనపల్లె ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీనివాసులును మెరుగైన వైద్యం కోసం చెన్నై ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసులు మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. అయితే పోలీసులు ఇప్పటి వరకు ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించకపోవడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మదనపల్లె రూరల్ : ఉరివేసుకుని గుర్తు తెలియని వ్యక్తి (55) మృతి చెందిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. బెంగళూరు రోడ్డు చిప్పిలి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి నైలాన్ తాడుతో ఉరి వేసుకోగా, దాదాపు రెండు రోజుల క్రితం సంఘటన జరిగి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

రాయచోటి : రాయచోటి మండలం, ఎండపల్లి పంచాయతీ, రామిరెడ్డిగారిపల్లి సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. బుధవారం సాయంత్రం ఎస్‌ఐ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో ఏడుగురు జూదరులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ. 4,400 నగదు స్వాధీనం చేసుకున్నారు.

హార్సిలీహిల్స్ పతంజలికేనా?

- ఏప్రిల్ 14 టూరిజం యూనిట్‌ను పరిశీలించిన బృందం
- నేడు రాందేవ్ బాబా రాక
- ఉద్యోగుల్లో ప్రైవేటుకు ఇచ్చేస్తారా అన్న ఆందోళన


హార్సిలీహిల్స్

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ టూరిజం యూనిట్‌ను కూటమి ప్రభుత్వం పతంజలి సంస్థకు కట్టబెట్టేస్తుందా అన్న అనుమానాలను నిజం చేస్తూ గురువారం పతంజలి సంస్థ రాందేవ్ బాబా స్వయంగా ఇక్కడికి వస్తున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేసే పనుల్లో అధికారులు తలమునకలయ్యారు. హార్సిలీహిల్స్‌ను ప్రైవేటు పరం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని సాక్షి పలు కథనాలు ప్రచురించింది. ఏప్రిల్ 23 'స్టెర్లింగ్ పోయే..పతంజలి' వచ్చే శీర్షికన సాక్షి ప్రచురించిన కథనం నిజమే అని స్పష్టం అవుతోంది. చెన్నైకి చెందిన స్టెర్లింగ్ కంపెనీకి పర్యాటకశాఖ యూనిట్‌ను కట్టబెట్టేందుకు ప్రయత్నించి, అందుకు ఆస్తులను పరిశీలించుకునేందుకు సంస్థ బృందానికి అధికారిక అతిథి మర్యాదలను కల్పించారు. తర్వాత వెలుగులోకి రాని కారణాలతో ఆ సంస్థ వెనక్కు వెళ్లింది. తర్వాత పతంజలి ప్రతినిధుల బృందం ఏప్రిల్ 14న హార్సిలీహిల్స్ వచ్చి ఇక్కడి పరిస్థితులు, అతిథి గృహాలు, రెస్టారెంట్, ఖాళీ స్థలాలను పరిశీలించి వెళ్లింది. ఈ బృందం రాందేవ్ బాబాకు ఇక్కడి పరిస్థితులు వివరించి ఉంటారని, దీనితో ఆయనే స్వయంగా ఇక్కడికి వస్తున్నట్టు అర్థమవుతోంది. అధికారికంగా బాబా పర్యటన షెడ్యూలులో గురువారం ఉదయం డెహ్రాడూన్ నుంచి విమానంలో తిరుపతికి చేరుకుని, అక్కడికి సమీపంలోని కొన్నిచోట్ల పరిశీలనలు జరిపాక మధ్యాహ్నం హార్సిలీహిల్స్ చేరుకుంటారు. ఇక్కడి పర్యాటకశాఖ యూనిట్‌ను పరిశీలిస్తారని, మధ్యాహ్నం టూరిజం రెస్టారెంట్‌లో భోజనం చేస్తారని షెడ్యూలులో పేర్కొన్నారు. ఇక్కడి వాతావరణ పరిస్థితుల మేరకు పతంజలి కార్యకలాపాలను నిర్వహించుకునేందుకు అనువైన ప్రాంతంగా భావిస్తున్నట్టుగా చెబుతున్నారు. కాగా స్టెర్లింగ్ సంస్థకు టూరిజంను ఇచ్చేసి ప్రైవేటు పరం చేస్తారన్న ఆందోళనతో ఉన్న ఉద్యోగులకు ఆ సంస్థ తప్పుకోవడంతో ఊరట చెందారు. తర్వాత పతంజలి ప్రతినిధులు పరిశీలించి వెళ్లినప్పటి నుంచి తీవ్ర ఆందోళనతో ఉన్నారు. 2000లో ఇక్కడ పర్యాటకశాఖ యూనిట్ ప్రారంభం నుంచి దీన్ని నమ్ముకుని పని చేస్తున్న సిబ్బంది, కార్మికులు ఇప్పుడు ఆందోళనలో ఉన్నారు. పతంజలికి అప్పగిస్తే తమ బతుకులు ఏం కావాలని మథనపడుతున్నారు. పాతికేళ్లుగా టూరిజంను నమ్ముకున్న సిబ్బంది ఇప్పుడు మరో ఉపాధి వెతుక్కునే పరిస్థితుల్లో లేరు. అందులోనూ 45 నుంచి 50 ఏళ్ల వయసు దాటిన సిబ్బంది ఉన్నారు. వీరు మళ్లీ కొత్తగా ఉద్యోగాల కోసం పోరాటం చేసే పరిస్థితుల్లో లేరు. ఈ పరిస్థితుల్లో రాందేవ్‌బాబా రాక, అనంతర పరిణామాలపై ఏం జరుగుతుందో అన్న ఆందోళన సిబ్బందిలో వ్యక్తం అవుతోంది. ఆయన వచ్చి వెళ్లాక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన


అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

రాయచోటి జగదాంబ సెంటర్ : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు 36 జీఓ అమలు చేయాలని రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, శంకరయ్య మాట్లాడుతూ పని గంటలు పెంచి కేవలం రూ.15 వేల వేతనం ఇస్తున్నారని పారిశుద్ధ్య కార్మికులతో పాటు రూ.21 వేలు వేతనం ఇవ్వాలన్నారు. వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచి ఆప్కాస్ కొనసాగించాలని లేదంటే పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల ధర్నాకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఫయాజ్‌బాషా, సలీం మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మికులు దేవా, రమేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మీ, మౌనిక, రమణ తదితరులు పాల్గొన్నారు.

వేడినీళ్లు పడి బాలుడికి గాయాలు

మదనపల్లె రూరల్ : వేడినీళ్లు పడి బాలుడు గాయపడిన సంఘటన బుధవారం మండలంలో జరిగింది. వేంపల్లె క్రాస్‌కు చెందిన రవి కుమారుడు మౌనిష్ (6) ఇంట్లో ఆడుకుంటూ ప్రమాదశాత్తు వేడినీళ్లు ఉన్న పాత్రలో పడ్డాడు. ప్రమాదంలో బాలుడికి గాయాలు కాగా గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రయోజనం లేని పరిష్కార వేదిక

రాయచోటి టౌన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా పేదల సమస్యలకు ఏ మాత్రం పరిష్కారం లభించడం లేదని సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 17వ తేదీ రాయచోటి పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఎం. నాగమ్మ తన ఇంటిపై కరెంట్ తీగలు ఉన్నాయని వాటిని తొలగించాలని అర్జీ ఇచ్చిందన్నారు. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులు ఆమెతో మాట్లాడి రూ.16730లు చలానా రూపంలో వసూలు చేశారన్నారు. కానీ ఇంతవరకు విదుయత్ తీగలు తొలగించలేదన్నారు. పేదల సమస్యలపై సత్వరం స్పందించాలని ఆయన కోరారు.

సీటు వదలని అక్రమార్కుడు!

సాక్షి టాస్క్‌ఫోర్స్ : సాధారణంగా ఎవరైనా ఎనిమిదేళ్ల ఒక చోట పనిచేస్తే ప్రభుత్వం నిర్వహించే బదిలీల్లో కచ్చితంగా స్థాన చలనం పొందాలి. కానీ కడప ఇంటర్మీడియట్ డీఐఈఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తికి ఎనిమిది సంవత్సరాలు సర్వీసు పూర్తి కావడంతో ఇటీవల నిర్వహించిన బదిలీల్లో పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ చేశారు. దీంతో ఆయన ఈ నెల 13వ తేదీ పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధుల్లో చేరారు. అయితే ఇంతవరకు కళాశాలకు వెళ్లకుండా అనధికారంగా డీఐఈఓ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్నారు. అలా కొనసాగడానికి తగిన ఉత్తర్వులు కూడా లేవు. ఇతను బదిలీ అయినా తిరిగి డిప్యూటేషన్ మీద డీవీఈఓ ఆఫీసుకు తెచ్చుకునేందుకు తగిన ప్రతిపాదనలను ఆర్‌జేడీకి సంబంధం లేకుండా కమిషనర్ కార్యాలయానికి నేరుగా డీఐఈఓ కార్యాలయం నుంచి వెళ్లినట్లు తెలిసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల పోరుమామిళ్ల నుంచి డిప్యూటేషన్ మీద డీవీఈఓ ఆఫీసుకు తెచ్చుకునేందుకు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ నుంచి కూడా అనుమతి తీసుకోవాలి. అలా కూడా చేయకుండా అనధికారికంగా డీఐఈఓ కార్యాలయంలోనే కొనసాగుతున్నట్లు తెలిసింది. ఈయన జిల్లాలోని ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేసే సిబ్బందికి జీతాలు చేసేందుకు మామూళ్లు తీసుకుంటాడనే ఆరోపణలు ఉన్నాయి.

గొడవ కేసులో ఇద్దరికి రిమాండ్


మైలవరం : గొడవ కేసుకు సంబంధించి మండల పరిధిలోని అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన శివబ్రహ్మం, సుధాకర్‌లను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్యామసుందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల 11వతేదీన అయ్యవారిపల్లెలో గ్రామ జాతర నిర్వహించారన్నారు. ఈ జాతరలో పాత కక్షల కారణంగా ఇరువురు గొడవ పడ్డారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

అతిగా మద్యం తాగి..


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మదనపల్లె రూరల్ : అతిగా మద్యం తాగి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని చిత్తూరు బస్టాండు టౌన్ హాలుకు సమీపంలో షాపు రూముల ముందు ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన వ్యక్తి మంగళవారం ఉదయం నుంచి అక్కడే ఉంటూ మద్యం సేవిస్తున్నాడని బుధవారం మధ్యాహ్నం వరకు మెలకువగానే ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అతిగా మద్యం తాగడం వల్ల ఆరోగ్యం దెబ్బతిని పరిస్థితి విషమించి మృతి చెంది ఉంటాడని తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న వన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అభివృద్ధికి పరిశ్రమలే కీలకం


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి

రైల్వేకోడూరు అర్బన్ : సమాజంలో గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందడానికి పరిశ్రమలే కీలకమని జిల్లా సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలో ఉన్న రామదాస్ మినరల్స్ కంపెనీ ఏర్పాటుకు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి పరిశ్రమలు ఎంతో అవసరమన్నారు. అలాగే చుట్టు పక్కల నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. అలాగే స్థానిక ఎంపీటీసీ మల్లికార్జున మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మిల్లు యజమానులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చాపాడు : ప్రొద్దుటూరు - మైదుకూరు జాతీయ రహదారిలో గల నాగులపల్లె సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పుల్లయ్య అనే యువకుడికి గాయాలయ్యాయి. చాగలమర్రి సమీపంలోని మర్రిపల్లెకు చెందిన పుల్లయ్య బైక్‌లో ప్రొద్దుటూరు నుంచి మైదుకూరుకు వస్తుండగా బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన పుల్లయ్యను స్థానికులు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనపై విచారణ చేస్తున్నారు.

డీలర్‌ను వేధిస్తున్న తహసీల్దార్

చక్రాయపేట : మండలంలోని మహదేవపల్లె చౌక దుకాణపు డీలర్ ఊరిమిండి అంజనమ్మను తహసీల్దారు వేధింపులకు గురి చేయడమే కాకుండా మానసికంగా ఇబ్బంది పెడుతోందని చక్రాయపేట ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డిలు పేర్కొన్నారు. 1995 నుంచి రెగ్యులర్ డీలర్‌గా పనిచేస్తున్న అంజనమ్మ ఇప్పటి వరకు ఎలాంటి అక్రమాలకు పాల్పడ లేదన్నారు.

బీటెక్ రవి బంధువు వీరంగం



త్రిపుల్ ఐటీలోకి వెళుతున్న బీటెక్ రవి అనుచరుల కార్లు


త్రిపుల్ ఐటీలోకి ద్విచక్ర వాహనంలో వెళుతున్న బీటెక్ రవి బంధువు

- త్రిపుల్ ఐటీ ఓల్డ్ క్యాంపస్‌లో క్యాంటీన్ మేనేజర్‌పై దాడి
- ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని జైస్వాల్ కంపెనీ వారికి బెదిరింపులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పులివెందుల నియోజకవర్గంలో రోజురోజుకు టీడీపీ గుండాలు రెచ్చిపోతున్నారు. దాడులు, బెదిరింపులతో చెలరేగిపోతున్నారు. ఏదో ఒక రకంగా భయపెట్టి పంతం నెగ్గించుకోవాలన్న ఆలోచనతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారం అండగా ఉందని, తమను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో పెట్రేగి పోతున్నారు. ఎక్కడ చూసినా గొడవలు, బెదిరింపులతో ప్రత్యర్థులను బెదరగొట్టి పని కానిస్తుండడం ఆందోళన కలిగించే పరిణామం. వేంపల్లె మండలం త్రిపుల్ ఐటీ ఓల్డ్ క్యాంపస్ పరిధిలో ఉన్న జైస్వాల్ కంపెనీకి చెందిన క్యాంటీన్‌ను ఎలాగైనా చేజిక్కించుకోవాలన్న ఉద్దేశంతో పులివెందుల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి బంధువు, వేంపల్లె మండల ఇన్‌చార్జి అయిన రఘునాథరెడ్డి రెచ్చిపోయారు. మీరు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, మేము నడుపుకోవాలంటూ బెదిరింపులకు దిగడంతో పాటు ఏకంగా అక్కడ ఉన్న జైస్వాల్ కంపెనీ మేనేజర్ ఖాన్‌పై దాడులకు తెగబడ్డారు. ప్రత్యేకంగా రెండు వాహనాలతో పాటు బైకుల్లో వచ్చిన రఘునాథరెడ్డి, అతని అనుచరులు బీభత్సం సృష్టించారు. ఈ వ్యవహారంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఇలాంటి ఘటనలతో టీడీపీ ప్రతిష్ఠ మరింత దిగజారుతోందని ఆ పార్టీలోని కొందరు నేతలు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

టీటీడీ జేఈఓ వి.వీరబ్రహ్మం


బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న జేఈఓ వీరబ్రహ్మం

నందలూరు : టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయంలో జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను టీటీడీ జేఈఓ వి.వీరబ్రహ్మం ఆదేశించారు. అధికారులతో కలిసి ఆయన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. శ్రీ సౌమ్యనాథ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు జులై 5న ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు వాహనసేవలు ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆలయ పరిసరాలు ప్రతి రోజూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు దర్శనం, తాగునీరు, ప్రసాదాలు పంపిణీలో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతి రోజూ హరికథలు, ఆధ్యాత్మిక, భక్తి, సంగీత కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈలు వెంకటేశ్వర్లు, మనోహరం, డిప్యూటీ ఈఓలు నటేష్‌బాబు, శివప్రసాద్, ప్రశాంతి, డీఎఫ్‌ఓ ఫణికుమార్ నాయుడు, పట్టణీకరణ నిపుణుడు శ్రీరాముడు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపాక ఆలయాలను అభివృద్ధి చేస్తాం

రాజంపేట : పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకతోపాటు ఆలయాలను అభివృద్ధి చేస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం జెఈవో వీరబ్రహ్మం తెలిపారు. టీటీడీ అధికారులతో కలిసి తాళ్లపాకలోని సిద్దేశ్వరస్వామి ఆలయం, 108 అన్నమయ్య విగ్రహ ప్రాంతం,. ప్రారంభానికి నోచుకోని శ్రీవారి ఆలయంను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6నుంచి 15వతేది వరకు తాళ్లపాకలోని చెన్నకేశవ, సిద్దేశ్వరస్వామి ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో టీటీడీ డీఎఫ్‌ఓ ఫణికుమార్, డిప్యూటీ ఈఓ నటేష్‌బాబు, శివకుమార్, ప్రశాంతి, ఇంజనీరింగ్ ఎస్‌ఈ మనోహర్, ఈఈ సుమతి, విద్యుత్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో తెలుగు తమ్ముళ్ల గొడవ

- పరస్పరం వాదోపవాదాలు
- పరిశీలకుని ఎదుటే బాహాబాహీ
- టీడీపీలో బయటపడిన వర్గ విభేదాలు


సమావేశంలో పరసర్పం గొడవ పడుతున్న టీడీపీ నేతలు

రాజంపేట : రాజంపేట తెలుగుదేశం పార్టీలో తమ్ముళ్ల గొడవ తారాస్థాయికి చేరింది. బుధవారం స్థానిక రోడ్ల భవనాల అతిథి గృహం (అన్నమయ్య అతిథి గృహం)లో త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు, పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు వర్గీయులు ఇన్‌చార్జి విషయంపై గొడవకు దిగారు. ఇన్‌చార్జి లేకుండానే సమావేశం ఏమిటి అని ప్రస్తావన తెరపైకి వచ్చింది. బలిజ సామాజిక వర్గానికి చెందిన కొందరు, రాజు వర్గానికి చెందిన కొందరి మధ్య సవాళ్లు విసురుకున్నారు. పార్టీ సర్వనాశనమవుతోందని పరస్పరం దూషించుకున్నారు. వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. తోపులాట కొనసాగింది. ఇరువర్గాలను శాంతింప చేసే పనిలో కొందరు తమ్ముళ్లు మధ్యస్తం చేశారు. కానీ ఫలితం లేకుండా పోయింది. సమావేశం రసభాసగా మారిపోయింది. టీడీపీ కార్యాలయంగా గుర్తింపు పొందిన ఆర్‌అండ్‌బీ అన్నమయ్య అతిథి గృహంలో ఇరువర్గాల అరుపులు, కేకలతో దద్దరిల్లిపోయింది. పరిశీలకుడు శివ ఎదుట తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. ఇంతవరకు రాజంపేట ఇన్‌చార్జి ఎవరనేది అధిష్టానం తేల్చకపోవడంతో ఇరు వర్గాల మధ్య అగ్గి రాజుకుంది. బలిజ సామాజిక వర్గానికి చెందిన జువ్వాది అదృష్టదీపుడు సమావేశంలో బత్యాల చెంగల్రాయుడుకు మద్దతుగా నిలిచారు. అయితే ఇది జీర్ణించుకోలేని చమర్తి వర్గం వారు రగిలిపోయారు. టీడీపీ నాయకుడు ఆనంద్ మరికొంతమందితో వాదులాట తారాస్థాయికి చేరింది. ఇక చేసేదేమీలేక సమావేశాన్ని అర్ధంతరంగా ముగించేశారు. కులాల వారీగా టీడీపీలో నేతలు విడిపోయారు.

మహిళలపై అఘాయిత్యాలను అడ్డుకోలేరా?

అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

మదనపల్లె రూరల్ : మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు.. అఘాయిత్యాలను ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేకపోతోందని అఖిల భారత మహిళా సంఘం ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి ప్రశ్నించారు. బుధవారం ఆమె మదనపల్లెలో వడ్డీ రాక్షసుల ఆగడాల పై స్పందిస్తూ.. వేధింపులకు గురైన గౌరీ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆమెకు జరిగిన అన్యాయంపై ఆరా తీశారు. మరికొంతమంది బాధితులతో మాట్లాడిన అనంతరం గౌరీతో కలిసి స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక అవసరమున్న మహిళలను లక్ష్యంగా చేసుకుంటున్న కొంతమంది వడ్డీ వ్యాపారులు వారికి అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ, వారి వద్ద నుంచి అసలు కన్నా పదింతలు ఎక్కువగా వడ్డీ వసూలు చేస్తున్నారన్నారు. మదనపల్లెలో గౌరీ అనే మహిళకు స్థానికంగా ఉంటున్న మాజీ సైనికుడు ఏకాంబరరెడ్డి, ఆదివేని ఆనంద్, అతని భార్య మంజుల, బండి హరినాథ్, అతని భార్య అనురాధలు అప్పు ఇచ్చారన్నారు. వారి అప్పు తీర్చేసినా ఇంకా డబ్బులు ఇవ్వాలని వేధించడం, డబ్బులు కట్టలేని పక్షంలో వ్యభిచారం చేసి చెల్లించమని బలవంత పెట్టడం, అంతు చూస్తామని బెదిరించడం విచారకరమన్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నిందితులకు మరింత ఊతమిచ్చినట్లు అయిందన్నారు. ఈ సమావేశంలో బాధితురాలు గౌరి, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు, జిల్లా ఇన్‌చార్జి సాయి లక్ష్మి, అన్నమయ్య జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ, చిత్తూరు జిల్లా కన్వీనర్ భువనేశ్వరి, మదనపల్లె పట్టణ కమిటీ సభ్యులు రెడ్డి ప్రసన్న, షాహినా పాల్గొన్నారు.

బయటి రాష్ట్రాల వ్యాపారులు వెళ్లిపోండి

గుర్రంకొండ : బయటి రాష్ట్రాల వ్యాపారులంతా గుర్రంకొండను వదిలి వెళ్లిపోవాలంటూ స్థానిక వ్యాపారులు బస్టాండులో హల్ చల్ చేశారు. బయట రాష్ట్రాల వ్యాపారుల దుకాణాల వద్దకు వెళ్లి తక్షణం గుర్రంకొండను వదిలివెళ్లిపోవాలంటూ హుకుం జారీ చేశారు. పోలీలసులు రంగప్రవేశం చేయడంతో వివాదం పెద్దది కాకుండా సద్దుమనిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంకొండ పట్టణంలో గత ఇరవై సంవత్సరాలుగా బయట రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఒకొక్కరు వచ్చి ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల బీహార్, ఉత్తర ప్రదేశ్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, రాజస్థాన్, గుజరాత్‌కు చెందిన వ్యాపారులు, కూలీలు, ఇతర చేతవృత్తుల వారు సుమారు 2 వేల మంది వరకు ఇక్కడికి వచ్చారు. గత కొంతకాలంగా బయట రాష్ట్రాలకు చెందిన వ్యాపారుల వల్లే మా వ్యాపారాలు దెబ్బతింటున్నాయని స్థానిక వ్యాపారులు వారిపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. వేలాది రుపాయలు అద్దెలు చెల్లించి రూముల్లో చేసే వ్యాపారాల కంటే ఖాళీ స్థలాల్లో షెడ్లు వేసుకొని బయట రాష్ట్రాల వ్యాపారులు చేసే వ్యాపారాలే లాభసాటిగా మారాయి. దీంతో వారం రోజుల క్రితం స్థానిక వ్యాపారులు ఒక సంఘంగా ఏర్పడి పంచాయతీ ఈవో, ఎస్‌ఐ, తహసీల్దార్లకు వినతి పత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం మరోసారి స్థానిక వ్యాపారులంతా ఏకమై బయట రాష్ట్రాల వ్యాపారుల దుకాణలపై పడ్డారు. మీరు ఇక్కడ వ్యాపారాలు చేసుకోకూడదు, వెంటనే కొత్త వ్యాపారాలన్నింటిని నిలిపివేయాలని హెచ్చరించారు. దీంతో వివాదం పెద్దదిగా మారింది. విషయం తెలుసుకొన్న ఎస్‌ఐ రఘురామ్ తమ సిబ్బందిని అక్కడి పంపించి వివాదం సద్దుమణిగేలా చర్యలు చేపట్టారు. అనంతరం ఇరువర్గాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. బయట ప్రాంతాలకు చెందిన వారిని ఇక్కడ వ్యాపారం చేసుకోవద్దు అని చెప్పే హక్కు ఎవరికి లేదన్నారు. చట్టాలను ఉల్లంఘించి ప్రవర్తించే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించి పంపారు.

నా ప్లాటుపై జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి


మీడియాతో మాట్లాడుతున్న బాధితురాలు శ్రీపతి రామమునెమ్మ, కుటుంబ సభ్యులు

పులివెందుల టౌన్ : తన ప్లాటుపై జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని బాధితురాలు శ్రీపతి రామమునెమ్మ కోరారు. బుధవారం పట్టణంలోని స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం కార్యాలయంలో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థలం విషయంలో తనకు అన్యాయం చేసిన టీడీపీ నాయకుడు అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎస్పీ అశోక్‌కుమార్‌లకు విన్నవించానన్నారు. తన స్థలాన్ని పునరుద్ధరించి రక్షణ కల్పించాలన్నారు. అలాగే ప్రభుత్వ కాలువ ఆక్రమణలతో పాటు సంబంధిత మున్సిపల్, రిజిస్ట్రేషన్ అధికారులపై కూడా విచారణ జరపాలని కోరారు. తన ప్లాటు నెంబర్ 10ను మల్లెల రాజేశ్వరి నుంచి కొనుగోలు చేశానని, రెవెన్యూ ఖాతాలో తన పేరు కూడా నమోదైందన్నారు. అయితే టీడీపీ నాయకుడు అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి అసలైన అమ్మకందారుతో కలిసి అక్రమ లాభార్జన కోసం అదే లింక్ డాక్యుమెంట్‌ను ఉపయోగించి దొంగ రిజిష్టర్ చేయించుకున్నారన్నారు. అలాగే తన స్థలంతోపాటు పక్కన ఉన్న ప్రభుత్వ కాలువ భూమిని కూడా విజయ్‌కుమార్ రెడ్డి ఆక్రమించాడని, మున్సిపల్ అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మించారన్నారు. ఈనెల 23వ తేదీ సోమవారం రాత్రి విజయ్‌కుమార్‌రెడ్డి, లక్షుమయ్యలతోపాటు మరికొంతమంది రాత్రివేళ నిబంధనలకు విరుద్ధంగా తన స్థలంలోకి ప్రవేశించి సిమెంట్ నిల్వ కోసం ఏర్పాటు చేసిన రేకుల షెడ్డును ధ్వంసం చేసి జేసీబీ ద్వారా స్థలాన్ని చదును చేశారన్నారు.